

హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, వేదికపై మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, బీఆర్‌ఎస్ నాయకులు ఒంటెద్దు నర్సింహారెడ్డి, కాసోజు శంకరమ్మ







హెలిప్యాడ్ వద్ద సీఎం కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల, ఎమ్మెల్యే శానంపూడి

# హోరెత్తిన హుజూర్‌నగర్

**ఎటు చూసినా జనం**

**బీఆర్‌ఎస్ ప్రభంజనం**



సీఎం కేసీఆర్ ప్రసంగానికి స్పందిస్తూ ఈలలు వేస్తున్న యువకులు



హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

సూర్యాపేట, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ)/ నేరేడుచర్ల : హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి నేతృత్వంలో మంగళవారం ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభ హోరెత్తింది. సభా ప్రాంగణంతోపాటు ఎటు చూసినా కనుచూపు మేరలో జన ప్రభంజనం కనిపించింది. హుజూర్‌నగర్ పట్టణంతోపాటు ఏడు మండలాల నుంచి సభకు వేలాదిగా జనం తరలివచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ఉండగా.. ఉదయం 11 గంటల నుంచే ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాల్లో సభా ప్రాంగణానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. దీంతో పట్టణ వీధులన్నీ కిటకిటలాడాయి. ప్రజలు గులాబీ జెండాలు చేతబట్టి డప్పులు, డోళ్లు కొట్టుకుంటూ హాజరై ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకించారు. సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే సైదిరెడ్డి పేరు ఉచ్చరించగానే పెద్ద ఎత్తున కేరింతలు, ఈలలు వేస్తూ గులాబీ జెండాలను రెపరెపలాడించారు. తొమ్మిదేండ్లలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ దళితబంధు అనగానే కేరింతలు కొట్టారు. అలాగే 'ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతు బంధు వద్దంటున్నాడు.. రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలంటున్నాడు. అంతే చాలా.. లేక మనం ఇస్తున్న రైతుబంధు, 24 గంటల కరెంటు కావాలా? కావాలనేవారు చేతులెత్తాలనడంతో సభలో ఉన్నవారంతా చేతులు ఎత్తి పథకాలు కావాలి.. ఉత్తమ్ వద్దు అంటూ నినాదాలు చేశారు. 'బీఆర్‌ఎస్ గెలిస్తే ఒక్కరే ముఖ్యమంత్రి ఉంటారు.. మరి కాంగ్రెస్ గెలిచేది లేదు, సచ్చేది లేదు. కానీ.. ఇప్పటికే ఓ డజన్ మంది ముఖ్యమంత్రి పేర్ల జాబితా తయారైంది. అలాంటి పార్టీ కావాల్నా?' అని సీఎం అనడంతో వద్దంటూ జనం నినదించారు. మీ ఎమ్మెల్యే నా దగ్గరకు వచ్చి కొట్లాడి డబ్బులు తెచ్చి అభివృద్ధి చేస్తుండు.. హుజూర్‌నగర్ గతంలో ఎట్ల ఉంది.. ఇప్పుడెట్ల ఉంది అని సీఎం ప్రశ్నించగా బాగుందని జనం సమాధానం చెప్పారు. '2019లో గెలిచిన తరువాత తాను వచ్చి కృతజ్ఞత సభలో పాల్గొని ఇచ్చిన హామీలన్నీ పూర్తయ్యాయి. ఈసారి మళ్లీ సైదిరెడ్డిని గెలిపించండి మీ ఎమ్మెల్యే కోరినట్లు ఎన్ని నిధులైనా ఇస్తా.. నియోజకవర్గంలో మిగిలి ఉన్న పనులను మొత్తం పూర్తి చేసే బాధ్యత నేనే తీసుకుంటా' అని సీఎం కేసీఆర్ అనడంతో చప్పట్లతో సభ మార్మోగింది.



సీఎం సభకు తరలివస్తున్న మహిళలు



సీఎం సభకు బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు, జెండాలతో ర్యాలీగా వస్తున్న ప్రజలు







హుజూర్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు



### కండ్ల ముందు అభివృద్ధి కనిపిస్తున్నది..
## మరోసారి అవకాశం ఇవ్వండి

నేరేడుచర్ల, అక్టోబర్ 31 : నాకు రాజకీయ జీవితం ప్రసాదించిన ముఖ్యమంత్రి కేసీఆర్ బాటలోనే పయనిస్తా. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తా. ఉప ఎన్నికల్లో నేను గెలిచిన తరువాత కృతజ్ఞత సభలో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. నాలుగేండ్లలో రూ.4వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. చెక్‌డ్యామ్‌లు, ఆర్డీఓ కార్యాలయం, రూ.2వేల కోట్లతో ముక్త్యాల మేజర్ లైనింగ్, మూసీ నదిపై చెక్‌డ్యామ్‌లు, గుండ్లపహాడ్ లిఫ్ట్ తీసుకొచ్చా. ఇక్కడ 20ఏండ్లు పాలించినాయన ఎన్నికలప్పుడు తప్ప ఏ ఒక్క రోజైనా కనపడలేదు. ఒక్కో గ్రామంలో కోటి నుంచి రూ.10కోట్ల వరకు పెట్టినం. గతంలో గ్రామాల్లో రోడ్లపై గుంతలు ఉంటే.. జనం నాట్లు వేసి నిరసన వ్యక్తం చేసేవారు. నేడు సీసీ రోడ్లు లేని ఊరు లేదు. తెలంగాణ వస్తే ఏమైతదన్నరు.. ఇప్పుడు రెండు పంటలకు కృష్ణా నీళ్లు వస్తున్నాయి. మేళ్లచెర్వు జాతరను, జాన్‌పహాడ్‌కు వందల సంవత్సరాల్లో మొట్ట మొదటగా రూ.50లక్షలు ఇచ్చిన ఘనత మన ప్రభుత్వానిదే. నాలుగేండ్లలోనే ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి రానన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేశా. అదంతా ప్రతి ఒక్కరి కళ్ల ఎదుట సాక్షాత్కరిస్తుంది. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చుతూ నన్ను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్ది మీ రుణం తీర్చుకుంటా.

– హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి





